

అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 328 | వరంగల్ | బుధవారం, 07 అక్టోబర్ 2026 | పేజీలు: 05

- ఏళ్లుగా పాతుకుపోయిన వారిపై విమర్శలు
- ఖాళీల భర్తీకి ఎదురుచూపులు
- బదిలీలకు రాజకీయ సిఫారసులపై ఆరోపణలు

ఎస్సైల కొరత.. బదిలీలపై సందిగ్ధత!

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైల కొరత

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎస్సైల కొరత నెలకొంది. శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్సైలది కీలక పాత్ర కాగా కొన్ని స్టేషన్లలో ఎస్సైల బదిలీలు జరిగి రెండు, మూడు నెలలు గడుస్తున్నా ఖాళీలను భర్తీ చేయడంలేదు. దీంతో ఆయా స్టేషన్లలో విధుల నిర్వహించే సిబ్బంది పై ప్రభావం పడుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల నెక్కొండ పోలీస్ స్టేషన్ ఎస్సై సస్పెన్షన్‌కు గురై రెండు నెలలు గడిచినా.. ఇప్పటివరకు ఆ స్టేషన్‌కు పూర్తిస్థాయి ఎస్సైని నియమించలేదు. దీనిపై పోలీసు వర్గాల్లో భిన్న చర్చ జరుగుతోంది. ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలని స్థానికులు, పోలీసు వర్గాలు కోరుతున్నట్లు తెలుస్తోంది.

- అక్షరశక్తి, హన్మకొండ క్రైమ్

5



ప్రజల సహకారంతో వికసిత్ భారత్

ఘనంగా 'సేవా జ్యోతి యాత్ర'

- వికసిత్ భారత్ సంకల్ప సభలో బీజేపీ నేతల పిలుపు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాప్రతినిధిగా, ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల నిరంతర ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి అధ్యక్షతన హన్మకొండలో 'సేవా జ్యోతి యాత్ర – వికసిత్ భారత్ సంకల్ప సభ' నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జాతీయ నాయకుడు పి.మురళీధర్ రావు ముఖ్యఅతిథిగా, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నాయకురాలు రావు పద్మ రెడ్డి తదితరులు హాజరయ్యారు.అంబేద్కర్ విగ్రహం వద్ద 'సేవా జ్యోతి'ని ప్రతిష్ఠించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. - అక్షరశక్తి, హన్మకొండ

3

ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూల్చే రాజ్యమా?

వరంగల్ భద్రకాళి ఆలయం సమీపంలోని చెరబండరాజు కాలనీలో గుడిసెలు, తాత్కాలిక ఇళ్ల తొలగింపు వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా మాడవీధుల విస్తరణ, ఆలయ పరిసరాల్లోని అడ్డంకుల తొలగింపులో భాగంగా అధికారులు గుడిసెలను తొలగించారు. దీనిని వ్యతిరేకించిన కొందరు కాలనీవాసులు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బుధవారం ఉదయం మట్టెవాడ పోలీసులు, కుడా అధికారులు భారీ బందోబస్తు మధ్య గుడిసెల తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా కొందరు కాలనీవాసులు అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. దీంతో పలువురిని అదుపులోకి తీసుకుని మట్టెవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. ఆందోళనలో ఓ కాలనీవాసి గాయపడినట్లు స్థానికులు తెలిపారు. వీరికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్ అక్కడికి రావడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. - అక్షరశక్తి, హనుమకొండ



చెరబండరాజు కాలనీ ఇళ్ల కూల్చివేత

కాలనీవాసుల ఆందోళన

మద్దతుగా మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్

5

వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అక్షరశక్తి, ములుగు:ప్రభుత్వ వైద్య కళాశాల, దాని అనుబంధ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వైద్య విభాగంలో రెండు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. స్వర్ణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 12న ఉదయం 11 గంటల నుంచి 17న మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు, ఈ నెల 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హతలు, దరఖాస్తుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ https://gmcmulugu.org ను సందర్శించాలని ఆ ప్రకటనలో ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పూజారి సత్యనారాయణకు ఘన సన్మానం



అక్షరశక్తి, హనుమకొండ: తెలంగాణ రాజ్యాధికార పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పూజారి సత్యనారాయణను మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పద్మాక్షి రోడ్డులోని సంఘ భవనంలో ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంఈఓగా పదవీ విరమణ అనంతరం రాజకీయాల్లోకి వచ్చి బీసీల సంక్షేమం కోసం సేవలందిస్తున్న సత్యనారాయణ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కర్రు వెంకటేశ్వర్లు, అంబటి నరేందర్, తోట కనక రాములు, అంబటి కుమారస్వామి, మిద్దెల బాబు, తోట ప్రకాష్, చింతపట్ల సాంబయ్య, బొల్లం అశోక్, బండారి మహేందర్, గండె మధు, కర్రు మనోజ్ కుమార్, కనుకుంట్ల శ్రీనివాస్, షేర్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు





అక్షరశక్తి, హనుమకొండ: జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ గురుకుల విద్యాసంస్థలు పచ్చదనం, పరిశుభ్రతతో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు స్వచ్ఛమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.కలెక్టర్ ఆదేశాల మేరకు గత వారం రోజులుగా సంక్షేమ శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యాసంస్థల ఆవరణల్లోని చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు విద్యార్థులు నివసించే వసతి గదులు, తరగతి గదులు, వంటగదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. గురుకులాలు, పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం ద్వారా విద్యార్థులు డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా విద్యాభ్యాసం కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంస్థల్లో పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు అధికారులు నిరంతరం చర్యలు తీసుకుంటున్నారు.



రామప్పకు ముప్పుగా ఓపెన్ కాస్ట్

- గనుల ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలి: ప్రొఫెసర్ పాండు రంగారావు



అక్షరశక్తి, హనుమకొండ: యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన కాకతీయ రుద్రేశ్వర (రామప్ప) దేవాలయం, రామప్ప సరస్సుకు వెంకటాపూర్‌లో ప్రతిపాదించిన సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల ప్రాజెక్టుతో తీవ్ర ముప్పు పొంచి ఉందని కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ట్రస్టీ ప్రొఫెసర్ ఎం. పాండు రంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం నిర్వహించిన ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రామప్ప సరస్సు, దేవాలయానికి దిగువ ప్రవాహ దిశలో సుమారు 5 కిలోమీటర్ల దూరంలో 300 మీటర్ల లోతు వరకు ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ గని ప్రాంతం భౌగోళికంగా అస్థిరంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో అనేక భ్రంశాలు, పగుళ్లు, భౌగోళిక రేఖలు ఉన్నాయని, గని తవ్వకాలతో భూగర్భ జలాల ప్రవాహంపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.రామప్ప సరస్సుకు సుమారు 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, దాదాపు 30 వేల ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం ఉందని తెలిపారు. గని తవ్వకాల వల్ల ఏర్పడే అధిక నీటి పీడనం కారణంగా భూగర్భ జలాల లీకేజీ వే గవంతమయ్యే ప్రమాదం ఉందని, ఇది రామప్ప సరస్సు కట్టపై ప్రభావం చూపవచ్చని అన్నారు. రామప్ప దేవాలయానికి ప్రత్యేకమైన ఇసుక పెట్టె పునాది నిర్మాణం ఉందని, భూగర్భంలో నీటి ప్రవాహ మార్గాలు ఏర్పడటం వల్ల ఈ పునాది బలహీనపడే అవకాశం ఉందని జీఎస్ఐ నివేదికలో పేర్కొన్నట్లు వివరించారు. అలాగే గనుల్లో జరిగే పేలుళ్ల వల్ల ఏర్పడే పునరావృత కంపనాలు దీర్ఘకాలంలో దేవాలయ నిర్మాణంపై ప్రభావం చూపవచ్చని, ఇప్పటికే రంగ మండపంలోని భారీ నేల దూలల్లో పగుళ్లు, అసమాన కూర్చివేత వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు.ఓపెన్‌కాస్ట్ గనుల వల్ల రామప్ప ప్రాంత జీవవైవిధ్యం, పర్యావరణం, స్థానిక ప్రజల సామాజికఆర్థిక జీవనం, సాంస్కృతిక, మత పరమైన అనుబంధాలు దెబ్బతినే అవకాశం ఉందని ప్రొఫెసర్ పాండు రంగారావు పేర్కొన్నారు. భౌగోళిక పగుళ్లు, రేఖల ద్వారా నీటి ప్రవాహం పెరిగితే రామప్ప సరస్సు నుంచి భారీగా నీరు బయటకు వెళ్లి కట్టకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని, దీనివల్ల పరిసర ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే ప్రమాదం ఉందన్నారు. ప్రపంచ వారసత్వ సంపద అయిన రామప్ప దేవాలయం, రామప్ప సరస్సును కాపాడేందుకు ప్రతిపాదిత సింగరేణి ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గనుల వల్ల ధూళి, వాయు కాలుష్యం పెరిగి పర్యావరణ అసమతుల్యతకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రభుత్వం, సింగరేణి సంస్థ ఈ అంశాన్ని అత్యంత సున్నితంగా పరిశీలించాలని కోరారు.

మానవ జీవన శ్రేయస్సు శాస్త్రంతోనే సాధ్యం

కేయూ వీసీ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి



అక్షరశక్తి,కేయూ క్యాంపస్: మానవ జీవన శ్రేయస్సు, అభివృద్ధి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంతోనే సాధ్యమవుతుందని కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. కేయూ సెనేట్ హాల్‌లో బుధవారం ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సదస్సు *‘‘Modern Biotechnology: Challenges and Opportunities’’*లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బయోటెక్నాలజీ ఆహారం, ఆరోగ్యం, పర్యావరణం, సుస్థిర అభివృద్ధితో పాటు భవిష్యత్‌లో మానవ మనుగడకు కూడా కీలకమవుతుందని పేర్కొన్నారు. రానున్న మూడు దశాబ్దాల్లో ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపులో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.సదస్సులో కీలక ఉపన్యాసం చేసిన కేయూ పూర్వ విద్యార్థి, మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ గిరిధర్ పర్వతం మాట్లాడుతూ, దేశంలో పరిశోధన, అభివృద్ధితో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని పరిశోధన, సృజనాత్మకతపై దృష్టి సారించాలని సూచించారు. బయోటెక్నాలజీ వైద్య, ఔషధ, వ్యవసాయ రంగాలకే పరిమితం కాకుండా అనేక రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ బయోటెక్నాలజీ రంగంలో నూతన పరిశోధనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విభాగం రజతోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టడం అభినందనీయమన్నారు. సదస్సు అధ్యక్షులు డాక్టర్ టి. శాస్త్రి మాట్లాడుతూ రెండు రోజుల్లో ఐదు ప్లీనరీ సెషన్లు, పోస్టర్ ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కన్వీనర్ డాక్టర్ పి. శ్రీనివాస్‌తో పాటు విశ్రాంత ఆచార్యులు, బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





327 యూనియన్ డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక

అక్షరశక్తి, హనుమకొండ: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 ఐఎన్‌టీయూసీ అనుబంధ హనుమకొండ టౌన్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి. సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా టి. ఉమేష్ కుమార్ ఎన్నికయ్యారు.
సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిట్టి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్. సుగుణాకర్ రావు, ఉపాధ్యక్షులుగా ఎస్. రాజు, ఎం. నరేందర్, కే. రాజు, ఎం. సురేష్, డి. శివరాజు ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా ఆర్. క్రాంతి కుమార్, బి. శ్రీకాంత్, యు. నగేష్, డి. విజయ్ కుమార్, వై. పరశురాములు ఎన్నికయ్యారు.
ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వై. శ్రీధర్, కే. సురేందర్, వై. ఎల్లయ్య, ఎన్. వంశీ, ఏ. నాగరాజు, బి. కుమారస్వామి, మహిళా ప్రతినిధిగా కొయ్యడ శోభ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.





విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టిక అల్పాహారం

- సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం లక్ష్యం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





అక్షరశక్తి, హసన్‌పర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టిక అల్పాహారం అందించడమే సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి ఆయన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు ఉదయం ఆకలితో పాఠశాలకు రాకుండా పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇడ్లీ, మిల్లెట్స్, పూరి, ఉప్మా తదితర అల్పాహారాన్ని రోజువారీ మెనూ ప్రకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు డ్రాపౌట్లను నివారించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, భోజన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హసన్‌పర్తిలోని పాఠశాలను రూ.6.80 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. 35 ఎకరాల్లో స్పోర్ట్స్ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నామని, ఇందులో ఇండోర్ స్టేడియంతో పాటు హాకీ, షటిల్, బాక్సింగ్ తదితర క్రీడలకు సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఉప్పరపల్లి క్రాస్ వద్ద నిర్మాణంలో ఉందని, వచ్చే ఏడాది నాటికి పూర్తవుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ద్వారా పౌష్టిక అల్పాహారం అందిస్తోందన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరై విద్యపై దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి స్వయంగా విద్యార్థులకు అల్పాహారం వడ్డించి, వారితో కలిసి కూర్చొని అల్పాహారం భుజించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, ఎంఈఓ శ్రీనివాస్, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమన వాణి, ప్రధానోపాధ్యాయులు సుమాదేవి, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో వికసిత్ భారత్

- ఘనంగా 'సేవా జ్యోతి యాత్ర'
- వికసిత్ భారత్ సంకల్ప సభలో బీజేపీ నేతల పిలుపు







అక్షరశక్తి, హన్మకొండ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాప్రతినిధిగా, ప్రభుత్వాధినేతగా 25 ఏళ్ల నిరంతర ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి అధ్యక్షతన హన్మకొండలో 'సేవా జ్యోతి యాత్ర - వికసిత్ భారత్ సంకల్ప సభ' నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జాతీయ నాయకుడు పి.మురళీధర్ రావు ముఖ్యఅతిథిగా, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నాయకురాలు రావు పద్మ రెడ్డి తదితరులు హాజరయ్యారు.అంబేద్కర్ విగ్రహం వద్ద 'సేవా జ్యోతి'ని ప్రతిష్ఠించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వేదికపై ఏర్పాటు చేసిన తెరల ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ సందేశాన్ని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వీక్షించారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో భాగస్వాములమవుతామని వేలాది మంది ప్రతిజ్ఞ చేశారు. సభ అనంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి అమరవీరుల స్థూపం వరకు భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ.. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు నరేంద్ర మోదీ నిరంతరం ప్రజాసేవకు అంకితమయ్యారని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. రహదారులు, రైల్వేలు, వ్యవసాయం, విద్య, వైద్యం, పరిశ్రమలు, పర్యాటకం, విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు కేటాయిస్తోందన్నారు.తెలంగాణలో రూ.47,984 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని, కాజీపేట రైల్వే కోచ్ తయారీ యూనిట్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతో పాటు హైదరాబాద్‌ను బయోఫార్మా, సెమీకండక్టర్, సాంకేతిక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం ప్రోత్సాహం అందిస్తోందని వివరించారు. ప్రధానమంత్రి స్వనిధి, ఎంఎస్ఎంఈ వృద్ధి నిధి ద్వారా చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. "సేవే సంకల్పంగా.. అభివృద్ధే లక్ష్యంగా.. వికసిత్ భారత్ కోసం మనమందరం కలిసి ముందుకు సాగుదాం" అని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా పదాధికారులు, డివిజన్, మండల అధ్యక్షులు, కౌన్సిల్ సభ్యులు, యువమోర్చా నాయకులు, విద్యార్థులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి రూ.6.15 కోట్ల నిధులు

అక్షరశక్తి, హుస్నాబాద్: మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ.6.15 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. ఇందులో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానానికి రూ.3.80 కోట్లు, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి శ్రీ స్వయంభు రాజేశ్వరస్వామి ఆలయానికి రూ.1.50కోట్లు, హుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి రూ.85 లక్షలు కేటాయించింది.కొత్తకొండ ఆలయంలో రూ.3,80,33,750తో ఐదు అంతస్తుల రాజగోపురం, ప్రాకార మండపం, బౌండరీ వాల్, దక్షిణ, పశ్చిమ వైపులా మూడు అంతస్తుల రాజగోపురాలు, కార్యాలయ భవనం, శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. పొట్లపల్లి ఆలయంలో రాజగోపురం మిగిలిన పనులకు రూ.50 లక్షలు, ప్రాకార మండపానికి రూ.కోటి ఖర్చు చేయనున్నారు. హుస్నాబాద్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో పట్నాల మండపం, బోనాల మండపం, ప్రసాదం తయారీ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.85 లక్షలు వినియోగించనున్నారు.ఆమోదించిన ప్రణాళికలు, అంచనాలు, దేవాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగానే నిధులను వినియోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అవసరమైన మేరకు మాత్రమే ఆలయాల వద్ద ఉన్న ఎఫ్‌డీఆర్‌ల నుంచి నిధులు ఉపసంహరించుకోవాలని, మిగిలిన మొత్తాన్ని ఎఫ్‌డీఆర్‌లలోనే కొనసాగించాలని ఆదేశించింది. ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేయడంపై భక్తులు, ఆలయ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ సువర్ణాక్షరాలతో లిఖించదగినది



అక్షరశక్తి, వరంగల్: ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన మైలురాయని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో, సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్ గోగుల రాణా ప్రతాపరెడ్డి అధ్యక్షతన బుధవారం వరంగల్ చౌరస్తాలో 'వికసిత్ సంకల్ప సభ' నిర్వహించారు.కార్యక్రమానికి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ కొండపల్లి శ్రీధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, వన్నాల శ్రీరాములు హాజరయ్యారు. 2047 నాటికి భారత్‌ను వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు మోదీ చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్క్రీన్‌లపై వీక్షించారు. ప్రధాని ప్రసంగం దేశాభివృద్ధికి, వికసిత్ భారత్ నిర్మాణానికి దిక్సూచిగా నిలిచిందని, కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు. అనంతరం సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా వరంగల్ చౌరస్తా నుంచి కొత్తవాడ వరకు 'సేవా జ్యోతి కలశయాత్ర'ను ఘనంగా నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో సాగిన యాత్ర జంక్షన్స్ ఎదురుగా ఉన్న జంక్షన్‌కు చేరుకుంది. జాతీయ గీతాలాపన అనంతరం సేవకు ప్రతీకగా తీసుకొచ్చిన సేవా జ్యోతిని అక్కడ ప్రతిష్ఠించి, ఆ కూడలికి 'వికసిత్ సేవా జ్యోతి జంక్షన్'గా బీజేపీ శ్రేణులు నామకరణం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కోకన్వీనర్ సిద్ధం నరేష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎర్రగొల్ల భరత్ వీర్, జలగం రంజిత్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, కంభంపాటి పుల్లారావు, మల్లాడి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్ తదితరులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళలు, నగర ప్రజలు పాల్గొన్నారు.

ఆదివాసీ మ్యూజియాన్ని సందర్శించిన ఐఐఎఫ్ఎం బృందం



అక్షరశక్తి, మేడారం: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, అటవీ ఆధారిత జీవనోపాధిపై క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్ (ఐఐఎఫ్ఎం)కు చెందిన ప్రొఫెసర్ శరదిందు పాండే నేతృత్వంలోని బృందం మేడారంలో పర్యటించింది. ఈ సందర్భంగా శ్రీ సమ్మక్కసారలమ్మ ఆదివాసీ మ్యూజియాన్ని సందర్శించి గిరిజన జీవన విధానానికి సంబంధించిన వివిధ అంశాలను పరిశీలించింది. ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచనల మేరకు ఐఐఎఫ్ఎం బృందం మేడారం పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మ్యూజియంలో ప్రదర్శిస్తున్న గిరిజనుల సంప్రదాయ వస్తువులు, కళాకృతులు, ఆచారాలు, జీవన విధానం, అటవీ ఆధారిత జీవనోపాధికి సంబంధించిన ప్రదర్శనలను బృంద సభ్యులు ఆసక్తిగా పరిశీలించారు. తెలంగాణ గిరిజన ప్రాంతాల ప్రత్యేకతలు, సంస్కృతి పరిరక్షణకు చేపడుతున్న చర్యలపై వివరాలు తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా గిరిజనుల అభివృద్ధి, అటవీ ఉత్పత్తుల సేకరణ, విలువ జోడింపు, పర్యావరణ పర్యాటకం, గిరిజన సంస్కృతి పరిరక్షణ తదితర అంశాలను బృందం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తోంది. ఈ పర్యటన ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అనుభవాలను పరస్పరం పంచుకునే అవకాశం ఏర్పడిందని అధికారులు తెలిపారు.

++++++++



పసుల లక్ష్మారెడ్డికి డాక్టరేట్



అక్షరశక్తి, హనుమకొండ: కాకతీయ విశ్వవిద్యాలయం విద్యా విభాగ పరిశోధక విద్యార్థి పి. లక్ష్మారెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల తెలిపారు. “A Study of Interventions through ‘Sarva Shiksha Abhiyan’ (SSA) for Girls’ Education in Andhra Pradesh” అంశంపై విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఎస్. మహేందర్ రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి చెందిన డాక్టర్ పి. లక్ష్మారెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా విద్యా శాఖ అధికారిగా, హైదరాబాద్ లో జాయింట్ డైరెక్టర్ గా పనిచేశారు. ఈ సందర్భంగా పలువురు టీచర్లు, విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

గవర్నర్ కోటాలో రామకృష్ణకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలి



అక్షరశక్తి, హనుమకొండ: గవర్నర్ కోటాలో ప్రముఖ వైద్యులు, ప్రజా సేవకులు డా. పెరుమాండ్ల రామకృష్ణకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానానికి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర వెంకట్ నాయక్ విజ్ఞప్తి చేశారు. మాదిగలతో పాటు దళిత-బహుజన వర్గాల సంక్షేమం కోసం రామకృష్ణ ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌లో కొనసాగుతూ సేవలందిస్తున్నారని తెలిపారు. రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా పేదలకు వైద్య, సామాజిక సేవలు అందిస్తూ ‘పేదోళ్ల డాక్టర్’గా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన ఆయన సేవలను, పార్టీ పట్ల నిబద్ధతను గుర్తించి ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బానోతు లక్ష్మణ్ నాయక్, భాస్కర్ నాయక్, పంతుల్య వీరన్న, సమ్ములాలు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే షీ టీమ్ ప్రధాన లక్ష్యం





అక్షరశక్తి,హనుమకొండ: మహిళలపై జరిగే నేరాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని షీ టీమ్ ఎస్ఐలు టీ. యాదగిరి, ఎం. స్వాతి అన్నారు. బుధవారం హనుమకొండ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీ టీమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్‌లలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలను పంచుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు ఒంటరిగా తెలియని ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు టీసేఫ్ యాప్‌ను వినియోగించుకోవాలని, ఉద్యోగ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మహిళలపై ఎవరైనా అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తిస్తే భయపడకుండా వెంటనే షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. షీ టీమ్‌కు సంబంధించిన ఫిర్యాదులను సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నంబర్ 8712685270కు పంపవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచి నిందితులకు కౌన్సెలింగ్‌తో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, హెడ్ కానిస్టేబుల్ సూర్యనారాయణ, కానిస్టేబుళ్లు ఇమ్రాన్ ఖాన్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమన్వయంతో బతుకమ్మ, దసరా ఉత్సవాలు

వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి



అక్షరశక్తి, హనుమకొండ: జిల్లాలో బతుకమ్మ, దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తిచేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 10వ తేదీ నుండి 21 వరకు జరగనున్న బతుకమ్మ, దసరా ఉత్సవాలకు సంబందించి వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్ల పై సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, దేవాదాయ, ఇతర శాఖల అధికారులతో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సమీక్షించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతీ పండుగకు సంబంధిత అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటే అన్నీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవచ్చన్నారు. అధికారులు సమన్వయంతో బాధ్యతయుతంగా విధులని నిర్వర్తించి బతుకమ్మ, దసరా ఉత్సవాలు ఘనంగా జరిగేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, దేవాదాయ శాఖ, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి భక్తులకు ఇబ్బంది కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.... ఎంగిలి పూల బతుకమ్మ వేయి స్తంభాల గుడిలో.. అలాగే సద్దుల బతుకమ్మ వేడుకలు పద్మాక్షమ్మ ఆలయంలో జరుగుతాయాన్నారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలు జరిగే ప్రదేశాలలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో భద్రకాళి ఆలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల గురించిన వివరాలను ప్రధానార్చకులు భద్రకాళి శేషు వివరించగా, వేయి స్తంభాల గుడి, పద్మాక్షమ్మ దేవాలయాలలో జరగనున్న బతుకమ్మ ఉత్సవాలను గురించి ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, శంకర్ శర్మ అర్చకులు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత , గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న , జడ్పీ సీఈఓ శేషాద్రి, డిఆర్డిఓ మేన శ్రీను, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు వెంకన్న , వెంకటేష్ , దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, వివిధ శాఖల అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సీపీ ఎన్. శ్వేత



అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్: తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఈ అక్టోబర్ నెలను సైబర్ మోసాలపై అవగాహన కల్పించే నెల గా ప్రకటించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత సూచించారు. ఫోన్ కాల్స్, SMSలు, WhatsApp మెసేజ్‌లు, ఈమెయిల్స్ లేదా అనుమానాస్పద లింకులు వచ్చినప్పుడు “ఆగండి... ఆలోచించండి... ధృవీకరించండి” అనే విధానాన్ని పాటించాలని తెలిపారు. KYC, బ్యాంక్ ఖాతా బ్లాక్, లాటరీ, ఉద్యోగ అవకాశాలు, పెట్టుబడులపై భారీ లాభాలు వంటి పేర్లతో వచ్చే మోసపూరిత కాల్స్, సందేశాలను నమ్మవద్దని సూచించారు. ఆన్‌లైన్ షాపింగ్‌లో భారీ డిస్కౌంట్లు, అతి తక్కువ ధరల పేరుతో వచ్చే నకిలీ వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, కొనుగోలు చేసే ముందు వెబ్‌సైట్ URL, విక్రేత వివరాలను ధృవీకరించుకోవాలని తెలిపారు. OTP, UPI PIN, ATM/డెబిట్ కార్డు లాంటి వివరాలు, CVV, PIN, పాస్‌వర్డ్‌లు ఎవరితోనూ పంచుకోరాదని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకూడదని స్పష్టం చేశారు. అత్యవసరంగా డబ్బును పంపాలని ఒత్తిడి చేసే వ్యక్తులను నమ్మవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి, cybercrime.gov.inలో ఆన్లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించే సైబర్ క్రైమ్ అవేర్‌నెస్ పోస్టర్లను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్ రావు, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్ మరియు కమీషనరేట్ AOలు పాల్గొన్నారు.

ఎస్సైల కొరత.. బదిలీలపై సందిగ్ధత!

- వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైల కొరత
- ఏళ్లుగా పాతుకుపోయిన వారిపై విమర్శలు
- ఖాళీల భర్తీకి ఎదురుచూపులు
- బదిలీలకు రాజకీయ సిఫారసులపై ఆరోపణలు



అక్షరశక్తి, హన్మకొండ క్రైమ్: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో ఎస్సైల కొరత నెలకొంది. శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్సైలది కీలక పాత్ర కాగా కొన్ని స్టేషన్లలో ఎస్సైల బదిలీలు జరిగి రెండు, మూడు నెలలు గడుస్తున్నా ఖాళీలను భర్తీ చేయడంలేదు. దీంతో ఆయా స్టేషన్లలో విధుల నిర్వహించే సిబ్బంది పై ప్రభావం పడుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల నెక్కొండ పోలీస్ స్టేషన్ ఎస్సై ఆస్పత్రిలో గుండెపోటుతో మృతిచెందిన.. ఇప్పటివరకు ఆ స్టేషన్‌కు పూర్తిస్థాయి ఎస్సైని నియమించలేదు. దీనిపై పోలీసు వర్గాల్లో భిన్న చర్చ జరుగుతోంది. ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలని స్థానికులు, పోలీసు వర్గాలు కోరుతున్నట్లు తెలుస్తోంది.

ఏళ్లుగా తిష్ట..?

కమిషనరేట్ పరిధిలోని కొన్ని పోలీస్ స్టేషన్లలో ఎస్సైలు ఏళ్ల తరబడి కొనసాగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆదాయ వనరులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పనిచేస్తున్న కొందరు ఎస్సైలు అక్కడే కొనసాగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బదిలీల కోసం కొందరు అధికారులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నప్పటికీ ఫలితం లేదని ఆశావహుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలేవి ?

కొన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్సైలపై వివిధ ఆరోపణలు వస్తున్నప్పటికీ.. వాటిపై ఉన్నతాధికారుల స్థాయిలో తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమపై ఎలాంటి చర్యలు ఉండవనే ధీమాతో కొందరు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా పోలీసు వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా జరిగిన నిర్ధారణలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

సిఫారసులా.. సీనియర్టీ నా..

ఎస్సైల బదిలీల విషయంలో రాజకీయ సిఫారసుల ప్రభావం పెరుగుతోందనే చర్చ కొంతకాలంగా పోలీసు వర్గాల్లో ఉంది. తమకు అనుకూలంగా ఉండే అధికారులను తమ ప్రాంతాలకు బదిలీ చేయించుకునేందుకు కొందరు ప్రజాప్రతినిధులు పోలీసు ఉన్నతాధికారులకు సిఫారసులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎస్సైల బదిలీల్లో సిఫారసుల కంటే సీనియారిటీ, సమర్థత, విధి నిర్వహణలో నిబద్ధత వంటి అంశాలకే ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర స్థాయి పోలీసు ఉన్నతాధికారులు సూచించినట్లు సమాచారం. దీంతో రాబోయే బదిలీల్లో సిఫారసు లేఖలకు ప్రాధాన్యం ఉంటుందా? లేక ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయాలు తీసుకుంటారా? అనేది పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఎస్సైల బదిలీలకు కసరత్తు

ఇదిలా ఉండగా వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైల బదిలీలకు కమిషనర్ కార్యాలయం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఖాళీగా ఉన్న స్టేషన్లకు ఎస్సైల నియామకంతో పాటు.. ఒకే చోట ఎక్కువ కాలంగా పనిచేస్తున్న అధికారుల బదిలీలపై కూడా పరిశీలన జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రజాప్రతినిధుల సిఫారసులకు ప్రాధాన్యం ఇస్తే ఉన్నతాధికారుల నుంచి అభ్యంతరాలు వచ్చే అవకాశం ఉందని.. వాటిని పక్కన పెడితే రాజకీయ ఒత్తిళ్లు ఎదుర్కొనే అవకాశం ఉందనే సందిగ్ధతలో బదిలీల ప్రక్రియ ఆలస్యమవుతోందనే చర్చ సాగుతోంది. ఎస్సైల ఖాళీలను భర్తీ చేయడంతో పాటు.. దీర్ఘకాలంగా ఒకే స్టేషన్‌లో కొనసాగుతున్న అధికారుల విషయంలోనూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకుంటారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.





ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూల్చే రాజ్యమా?

- చెరబండరాజు కాలనీ ఇళ్ల కూల్చివేత
- కాలనీవాసుల ఆందోళన
- మద్దతుగా మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్

అక్షరశక్తి, హనుమకొండ: వరంగల్ భద్రకాళి ఆలయం సమీపంలోని చెరబండరాజు కాలనీలో గుడిసెలు, తాత్కాలిక ఇళ్ల తొలగింపు వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా మాడవీధుల విస్తరణ, ఆలయ పరిసరాల్లోని అడ్డంకుల తొలగింపులో భాగంగా అధికారులు గుడిసెలను తొలగించారు. దీనిని వ్యతిరేకించిన కొందరు కాలనీవాసులు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బుధవారం ఉదయం మట్టెవాడ పోలీసులు, కుడా అధికారులు భారీ బందోబస్తు మధ్య గుడిసెల తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా కొందరు కాలనీవాసులు అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. దీంతో పలువురిని అదుపులోకి తీసుకుని మట్టెవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. ఆందోళనలో ఓ కాలనీవాసి గాయపడినట్లు స్థానికులు తెలిపారు. వీరికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్ అక్కడికి రావడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

బాధితుల ఆవేదన...

తమ ఇళ్లను తొలగించే ముందు మంగళవారం రాత్రి జిల్లా కలెక్టర్ ను కలిసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసినట్లు కాలనీవాసులు తెలిపారు. గతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీలను పూర్తిగా అమలు చేయకుండానే తమ నివాసాలను తొలగించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లను కూల్చివేసి తమనే పోలీసులు అదుపులోకి తీసుకోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. అయితే అధికారులు, స్థానికుల సమాచారం ప్రకారం.. గతంలో ఆలయ భూముల్లో ఏర్పాటు చేసుకున్న సుమారు 70 నుంచి 80 గుడిసెలను కొందరు నివాసులు స్వచ్ఛందంగా ఆలయానికి, ప్రభుత్వానికి అప్పగించినట్లు తెలిసింది. దీనికి ప్రత్యామ్నాయంగా అర్హులైన కొందరికి భద్రకాళి ఆలయంలో తాత్కాలిక ఉపాధి కల్పించడంతో పాటు మరికొందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. అయితే మిగిలిన కొందరు గుడిసెల తొలగింపును అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొన్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇదేనా ఇందిరమ్మ రాజ్యం???

కాలనీ వాసులకు మద్దతుగా మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించిన నేపథ్యంలో పోలీసులు ఆయనను తొలుత గృహనిర్బంధం చేశారు. అనంతరం ఆయనను నుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. "ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూల్చే రాజ్యమా?" అని ప్రశ్నించారు. పేదల నివాసాలను తొలగించే ముందు వారికి ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. పేదల సమస్యలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టులు, నిర్బంధాలతో అడ్డుకోవడం సరికాదని విమర్శించారు. పేదల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. భద్రకాళి ఆలయ అభివృద్ధికి గతంలో తమ ప్రభుత్వం రూ.30 కోట్ల నిధులు కేటాయించిందని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి తమ సహకారం ఉంటుందని, అదే సమయంలో పేదలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు ప్రభుత్వ భూములు, ఆలయ పరిసరాల్లోని అక్రమ నిర్మాణాలు, తాత్కాలిక గుడిసెల తొలగింపు అభివృద్ధి పనుల్లో భాగంగానే చేపట్టినట్లు అధికార వర్గాల సమాచారం. విధులకు ఆటంకం కలిగించిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. గుడిసెల తొలగింపు, కాలనీవాసుల ఆందోళన, పోలీసుల అదుపులోకి పలువురి తరలింపు, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ నిర్బంధంతో భద్రకాళి ఆలయ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.